

కొత్త సర్వీస్ రూల్స్ సాధనకు..
ఉపాధ్యాయులకు కొత్త సర్వీస్ రూల్స్ సాధనే కాంగ్రెస్ మేనిఫెస్టో అని వరాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 8లో▸



కోట్‌పల్లిలో క్విజ్ పోటీలు
శిక్షణ ఫౌండేషన్ మైండ్ ట్రీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. 8లో▸



అణగారిన వర్గాల ఆశాజ్యోతి
అణగారిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 9లో▸

న్యూస్‌రీల్

ఉచిత వైద్య సేవలు అభినందనీయం



ఉచిత వైద్య శిబిరంలో ఆర్టీసీ సిబ్బంది

పరిగి: ఆర్టీసీ సిబ్బందికి ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఆర్టీసీ డీఎం పవిత్ర అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణ కేంద్రంలో శారద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆర్టీసీలోని మహిళా సిబ్బందికి ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ఒత్తిడి కారణంగా సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోని వారు ఎంతో మంది ఉంటారన్నారు. అటువంటి వారికి ఉచిత వైద్య సేవలు అన్ని రకాలుగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓ కృషి వల్లే కందిపప్పునకు గుర్తింపు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా

యాలాల: తాండూరు కందిపప్పుకు భౌగోళిక గుర్తింపు రావడం వెనుక యాలాల రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ) కృషి ఎంతో ఉందని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. శుక్రవారం హాజీపూర్ శివారులో రైతు ఉత్పత్తిదారుల సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాబార్డు ఆర్థిక సహకారం, షేర్ సంస్థ ఆధ్వర్యంలో సంఘం అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. సంఘం ఆధ్వర్యంలో పప్పు మిల్లుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీటితో పాటు వ్యాపార లావాదేవీలు చేపట్టడం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉందన్నారు. సంఘం ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తాలో ఎరువులు, విత్తనాలు, టార్పాలిన్ కవర్లు లాంటి వాటి క్రయవిక్రయాలు చేపట్టాలని సూచించారు. అనంతరం సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, షేర్ సంస్థ ముఖ్య కార్యదర్శి మరాఠీ నర్సింహులు మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో రైతుల సహకారంతో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. త్వరలో కందులు, శనగలు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తరపున కంది మిల్లు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక సహకారం పొందేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో హాజీపూర్ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్, సంఘం సీఈఓ నరేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, సంఘం డైరెక్టర్లు ఉన్నారు.

నిరంతర కృషి అవసరం



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న శంకర్

వికారాబాద్ అర్బన్: విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి ఎస్. శంకర్ తెలిపారు. శుక్రవారం వికారాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానం సాధించేందుకు కఠోర శ్రమ ఒక్కటే మార్గమన్నారు. ఎంసెట్, జేఈఈ, నీట్ వంటి పరీక్షలు రాసి మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. అలాగే సాంకేతికతపై అవగాహన, నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్వర్ స్వామి, లైబ్రేరియన్ బంధ్యా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

అనంతగిరి: వ్యవసాయాధికారుల సూచనలను ఎప్పటికప్పుడు పాటిస్తూ అధిక దిగుబడి పొందాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మండలం గొట్టిముక్కుల గ్రామంలో ఆయన పర్యటించి పలు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి సాగులో నీటిని ఆదా చేసే పద్ధతులు, కలుపు నివారణ చర్యల సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్, ఏఈఓ అనిల్‌కుమార్, రైతుబంధు కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, నాగప్ప, స్వామి, రవి, లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడాయి
రూ.లక్షల్లో బకాయి

సర్కారుకు ప్రభుత్వ శాఖలే పన్ను ఎగ్గొడుతున్నాయి. ఏళ్లుగా పన్ను చెల్లించడంలేదు. మున్సిపల్ సేవలు మాత్రం పొందుతున్నాయి. ఫలితంగా మున్సిపల్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. సాధారణ పౌరులు, వ్యాపారులు పన్నులు చెల్లించకపోతే వెంటనే కొరడా ఝుళిపించే అధికారులు ప్రభుత్వ కార్యాలయాల విషయంలో మిన్నకుండిపోవడం గమనార్హం. రూ.లక్షల్లో బకాయిపడినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అధికారుల తీరుపై సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రభుత్వ డైట్ కళాశాల

ఆస్తిపన్ను ఎగ్గొడుతున్న ప్రభుత్వ శాఖలు

- ఏళ్లుగా పన్ను చెల్లించని కార్యాలయాలు
- చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం
- పేదలపైనే జులుం

వికారాబాద్ అర్బన్: అధికారులు, పాలకవర్గం పన్ను వసూలులో పేద ప్రజలపై చూపుతున్న శ్రద్ధ సర్కారు కార్యాలయాలపై చూపడంలేదు. మార్చి చివరి నాటికి వంద శాతం పన్ను వసూలు చేయాలన్న లక్ష్యంతో మున్సిపల్ బిల్‌కలెక్టర్లు పట్టణంలోని నివాసాల చుట్టూ తిరుగుతున్నారు. రూ.100 బకాయి ఉన్నా పురపాలక శాఖ అధికారులు వసూలు చేస్తున్నారు. కానీ ప్రభుత్వ శాఖలు రూ.లక్షల్లో బకాయి ఉన్నా వసూలు చేయలేకపోతున్నారు. బిల్‌కలెక్టర్ స్థాయి సిబ్బంది అనేకమార్లు వెళ్లినా అధికారుల నుంచి స్పందన కొరవడుతోంది. మొండి బకాయిలను మున్సిపల్‌లోని ఉన్నత స్థాయి అధికారులు, పాలకవర్గం సభ్యులు చొరవతీసుకుంటే కానీ బకాయిలు వచ్చే అవకాశం లేదు.

చర్యలకు వెనుకడుగు

జిల్లా కేంద్రంలోని ప్రధాన శాఖలు, జిల్లా కార్యాలయాలు పన్నులు సరిగ్గా చెల్లించడం లేదు. ఉన్నతాధికారులు కొలువుదీరే భవనాలు కావడంతో చర్యలకు పురపాలక శాఖ వెనుకాడుతోంది. కార్యాలయాలకు సంబంధించిన ఆస్తి పన్ను యేటా పురపాలక శాఖకు చెల్లించాలన్న కనీస బాధ్యతను అధికారులు విస్మరిస్తున్నారు. ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు 2010 నాటి నుంచి రూ.లక్షల్లో బకాయి పడ్డారు. తాఖీదులు జారీ చేస్తే కొంత మేర చెల్లిస్తున్నా ఆయా శాఖలు పెద్ద మొత్తం చెల్లించలేక పోతున్నాయి. మంచి నీరు, విద్యుత్, ఆస్తి పన్ను చెల్లింపులకు బడ్జెట్‌లో కార్యాలయాలకు ప్రభుత్వం నిధులు చెల్లిస్తున్నా పురపాలక శాఖకు మాత్రం పన్నులు చెల్లించడం లేదు. పాలన విభాగంలో ముఖ్య భూమిక పోషించే ఆర్డీఓ కార్యాలయమే పెద్ద మొత్తంలో బకాయి పడింది. జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం (టీటీసీ), వృత్తి విద్యాశిక్షణ కేంద్రం (ఐటీఐ), ఆర్‌అండ్‌బీ అతిథిగృహం, తహసీల్దార్ కార్యాలయం ఇలా మొత్తం 36 శాఖలకు సంబంధించి రూ.లక్షల్లో మున్సిపల్‌కు బకాయి ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఆయా ప్రభుత్వ శాఖలకు నోటీసులు పంపించి పన్ను వసూళ్లకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రతీ కార్యాలయానికి నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. మార్చి నెల చివరి నాటికి పూర్తి స్థాయిలో పన్ను వసూళ్లు చేస్తామని అధికారులు అంటున్నా అందులో ఎంతమేర సఫలమవుతారో చూడాలి.

ఇండస్ట్రియల్ పార్క్‌లో సైతం

మున్సిపల్ పరిధిలోని ఇండస్ట్రియల్ పార్కులోని పలు చిన్న చిన్న పరిశ్రమలు కూడా పెద్ద ఎత్తున మున్సిపల్‌కు పన్ను బకాయిలు ఉన్నాయి. యజమానులు రెండు మూడేళ్ల కొద్దీ పన్ను చెల్లించకపోవడంతో సుమారు రూ. 30లక్షల వరకు పన్ను రావాల్సి ఉంది. పన్ను వసూళ్లపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే కదలిక వచ్చే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

బకాయిలు ఇవీ..

ప్రభుత్వ డైట్ కళాశాల	:	రూ.19 లక్షలు
ఆర్డీఓ కార్యాలయం	:	రూ.10 లక్షలు
ఎస్సీ వసతిగృహం	:	రూ.10 లక్షలు
బీసీ వసతిగృహం	:	రూ.9 లక్షలు
ప్రభుత్వ ఆస్పత్రి	:	రూ.6లక్షలు
పంచాయతీ రాజ్	:	రూ.10లక్షలు
హార్టికల్చర్	:	రూ. 2.17 లక్షలు
టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం	:	రూ.7.38 లక్షలు

వంద శాతం వసూలుకు చర్యలు



పెద్ద ఎత్తున ఆస్తి పన్ను చెల్లించాల్సిన కార్యాలయాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. పన్ను చెల్లిస్తేనే మున్సిపల్ కార్యాలయం అన్ని రకాల సేవలను అందించే అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని ఆయా శాఖల అధికారులు గుర్తించి పన్ను చెల్లించాలని కోరుతున్నాం. ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రభుత్వ కార్యాలయాల నుంచి వంద శాతం పన్ను వసూలు చేస్తాం.

– శరత్ చంద్ర, మున్సిపల్ కమిషనర్

ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు 34 సంఘాల మద్దతు నాకే

''ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు, 34 ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతు నాకే ఉంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయభేరి మోగిస్తా. విద్య, ఉపాధ్యాయుల సమస్యలపై కనీస అవగాహన లేని కొంతమంది డబ్బులతో ఓట్లు పొందాలని భావిస్తున్నారు. అలాంటివారికి తగిన సమాధానం చెప్పాల్సిన బాధ్యత సమాజ నిర్మాతలైన టీచర్లపైన ఉంది''.



మంచి మెజార్టీతో విజయం సాధిస్తా

- కార్పొరేట్ అధిపతి కావాలో.. సేవకుడు కావాలో ఆలోచించాలి
- 317 బాధితులకు న్యాయం జరిపిస్తా
- పెన్షన్ స్కీం కోసం పోరాడుతా
- 'సాక్షి'తో పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'చట్టసభలకు కార్పొరేట్ యాజమాన్యాల అధిపతులను పంపుతారో..? విద్య, ఉపాధ్యాయ, అధ్యాపక రంగాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండి, ఏళ్ల తరబడి ఆయా రంగాల్లో పని చేస్తూ.. ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాడుతున్న తనలాంటి సేవకుడిని పంపుతారో? విజ్ఞులైన ఉపాధ్యాయ ఓటర్లే ఆలోచించాలి' అని హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ శాసన మండలి పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే.. చట్టసభల్లో ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుకనవుతానని చెప్పారు. ఈనెల 13న నిర్వహించనున్న ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఆయన 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. జీఓ నంబర్ 317 ద్వారా నష్టపోయిన బాధితులను తిరిగి వారి సొంత జిల్లాలకు రప్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని స్పష్టంచేశారు. మిగిలిన వివరాలు ఆయన మాటల్లోనే..

రైతు కుటుంబంలో పుట్టా..

మాది రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మొండిగౌరెల్లి. సామాన్య రైతు కుటుంబంలో జన్మించా. ఒకటి నుంచి ఐదు వరకు మొండిగౌరెల్లి ప్రభుత్వ పాఠశాలలో, 10 తరగతి వరకు చింతపట్లలో, మలక్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివా. న్యూసైన్స్ కాలేజీలో డిగ్రీ చదివి, ఉస్మానియా విశ్వవిద్యాయంలో పీజీ పూర్తి చేశా. వేంకటేశ్వర యూనివర్సిటీ నుంచి బీఈడీ పట్టా పొందా. 1983 డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికై ఆదిబట్ల సమీపంలోని బొంగుళూరులో తొలిసారి విధుల్లో చేరా. ఆ తర్వాత నందివనపర్తి, చీర్యాల, ఇంజాపూర్, బాలాపూర్, శేరిగూడ, కర్మన్‌ఘట్, హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల్లో పనిచేసి, 2018లో ఉద్యోగ విరమణ పొందా.

పీఆర్‌టీయూ కార్యకర్తగా

ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరిన నాటినుంచి పీఆర్టీయూ టీఎస్‌లో క్రియాశీలకంగా పని చేశా. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా, తెలంగాణ టీచర్స్ జేఏసీ చైర్మన్‌గా, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉపాధ్యాయులకు సేవలందించా. మహిళా ఉపాధ్యాయులకు అదనంగా ఐదు సీఎల్‌లు, 180 రోజుల ప్రసూతి సెలవులు, 90 రోజుల చైల్డ్‌కేర్ లీవ్స్, అప్రెంటిస్ టీచర్లకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్ పోస్టుల మంజూరు, దేశంలోనే తొలిసారిగా బదిలీల్లో వందశాతం కౌన్సెలింగ్ విధానం, జీఓ నంబర్ 40 ద్వారా హెచ్‌ఎం, ఎంఈఓలకు అధికారాలు, 2008లో 13 రోజుల సమ్మె, 2011లో 32 రోజుల సకల జనుల సమ్మె కాలానికి పూర్తి వేతనం ఇప్పించడంలో కీలక పాత్ర పోషించాను.

పెన్షన్ స్కీం కోసం ఒత్తిడి తెస్తా

ఉపాధ్యాయుడిగా, సంఘం ప్రతినిధిగా ఏళ్ల పాటు పని చేసిన అనుభవం ఉంది. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, ఉపాధ్యాయుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉంది. ఎమ్మెల్సీగా గెలిపించి చట్ట సభలకు పంపితే.. అదే స్ఫూర్తితో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా. స్కూళ్లలో వసతులు కల్పించడంతో పాటు ఖాళీ పోస్టుల భర్తీ, ఉద్యోగుల పెన్షన్ స్కీం కోసం పోరాడుతా.

రేషన్ పంపిణీలో జాప్యం

- దుకాణాలకు అందని బియ్యం
- అయోమయంలో కార్డుదారులు

కొడంగల్ : నియోజకవర్గంలో పీడీఎస్ బియ్యం సరఫరాలో జాప్యం జరుగుతోంది. ఈ నెల 10వ తేదీ దాటినా రేషన్ దుకాణాలకు పూర్తి స్థాయిలో బియ్యం పంపిణీ కాలేదు. పేదలకు సకాలంలో బియ్యం అందడం లేదు. కొడంగల్ మండలంలో 31 రేషన్ దుకాణాలు ఉన్నాయి. బొంరాస్‌పేట మండలంలో 29, దౌల్తాబాద్‌లో 30 రేషన్ దుకాణాలు ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు అందిన సమాచారం మేరకు కొడంగల్ మండలంలో 16 దుకాణాలకు, బొంరాస్‌పేట మండలంలో ఆరు దుకాణాలకు, దౌల్తాబాద్‌లో 7 దుకాణాలకు మాత్రమే సివిల్ సప్లై గోదాం నుంచి రేషన్ బియ్యం పంపించారు. మిగిలిన దుకాణాలకు పంపిణీ చేయలేదు. ఈ విషయంపై కొడంగల్ సివిల్ సప్లై ఇన్‌చార్జి, డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్‌ను వివరణ కోరగా.. స్టేజ్ 1 నుంచి రోజు ఒక లారీ మాత్రమే వస్తుందని తెలిపారు. స్టేజీ వన్ గోదాముల నుంచి లారీ రాగానే మూడు మండలాల్లోని రేషన్ దుకాణాలకు పంపిస్తున్నట్లు చెప్పారు. పై నుంచి సకాలంలో పంపిణీ చేయకపోవడం వల్లే జాప్యం జరుగుతోందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగమంతా అటువైపే దృష్టి పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. పేదలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



కొడంగల్ గోదాంకు వచ్చిన బియ్యం లారీ

పనుల్లో వేగం పెంచండి

- నిర్లక్ష్యం చేస్తే చర్యలు
- కలెక్టర్ నారాయణరెడ్డి
- వీడియోకాన్ఫరెన్స్‌లో అధికారులకు దిశానిర్దేశం

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణం, మనబడి, పల్లె పట్టణ ప్రగతి, ఇరిగేషన్ పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. గతంలో సూచించిన మేరకు పల్లె ప్రగతిలో పది రకాల పనులను చేపట్టాలని ఆదేశించినా కింది స్థాయిలో జరగడం లేదన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఎన్నో పనులు కావాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15 నాటికి సూచించిన పనులన్నీ పూర్తి చేయాలన్నారు. మనబడి కింద చేపట్టిన పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాకు మంజూరైన 16 చెక్ డ్యామ్‌లను మే 15 లోపు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్లు ఉండకూడదన్నారు. విద్యుత్ ప్రమాదాల వల్ల ఏ ఒక్కరికీ ప్రాణహాని జరిగినా క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ అశోక్ కుమార్, డీఆర్‌డీఓ కృష్ణన్, డీపీఓ తరుణ్ కుమార్, డీఈఓ రేణుకాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అటవీ భూములు ఆక్రమణకు గురికావొద్దు

జిల్లాలోని అటవీ భూములలో ఎలాంటి ఆక్రమణలు జరుగకుండా ఫెన్సింగ్ పనులు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి సమావేశం నిర్వహించాలన్నారు. ఆర్ఓఆర్ చట్టం ప్రకారం అర్హులకు పోడు భూములు ఇవ్వనున్నందునా బౌండరీ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు. దీనితో పాటు రెవెన్యూ ఫారెస్ట్ బౌండరీల సమస్యలను పరిష్కరించడంతో పాటు పీఆర్ , ఆర్ అండ్ బీ రోడ్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.





అరణ్య రోదన

- ఎండుతున్న అడవులు

నిజంగా ఇది అరణ్య రోదనే.. కొడంగల్ నియోజకవర్గంలో అడవులు ఎండిపోతున్నాయి. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లోని రిజర్వ్ ఫారెస్టులతో పాటు అడవుల్లోని చెట్లు, మొక్కలు ఎండు ముఖం పట్టాయి. వేసవి కాలం ప్రారంభం కావడంతో చెట్లకు నీటి లభ్యత తగ్గింది. దౌల్తాబాద్ రిజర్వ్ ఫారెస్టు, తిరుమలాపురం అడవి, సిద్ధనొంపు అటవీ ప్రాంతం, బొంరాస్‌పేట అటవీ ప్రాంతాల్లో పచ్చదనం కరువైంది. ఎక్కడ చూసినా చెట్లు ఎండిపోవడంతో అడవి బోసిపోయింది.

– కొడంగల్

బాల్యం పక్కదారి

- దావత్‌ల మోజులో చిన్నారులు
- మద్యానికి బానిసలవుతున్న వైనం
- చదువుకోవాల్సిన వయస్సులో ప్రేమ వ్యవహారాలు
- నిఘా మరిచిన తల్లిదండ్రులు

దౌల్తాబాద్: ఆట పాటలతో హాయిగా సాగాల్సిన బాల్యం పక్కదారి పడుతోంది. చదువుపై శ్రద్ధ పెట్టాల్సిన చిన్నారులు దావత్‌ల మోజులో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా మద్యానికి బానిసలవుతున్నారు. ఫోన్లు, సినిమాల మాయలో పడి పసితనంలోనే ప్రేమ వ్యవహారాలు సాగిస్తున్నారు. చిన్న వయస్సులో స్నేహితులతో కలిసి విలాసవంతమైన విందులు చేసుకోవడం జీవితంలో భాగంగా నేటి చిన్నారులు, యువత భావిస్తున్నారు. తమ పనుల్లో బిజీగా మారిన తల్లిదండ్రులు పిల్లల గురించి పట్టించుకోకపోవడంతో వారు పెడదారులు పడుతున్నారు. తెలిసి తెలియని స్కూల్ వయస్సులోనే విద్యార్థులు ప్రేమ వలలో చిక్కుకుంటున్నారు. ఆన్‌లైన్ తరగతుల పుణ్యమా అని విద్యార్థులకు ఫోన్లు కొనివ్వడంతో వారు చాటింగ్‌లు చేస్తూ బడి వయస్సులోనే ప్రేమ వలలో చిక్కి ఇంట్లో నుంచి వెళ్లిపోయి పెళ్లి దాకా వెళ్తున్నారు. 15 ఏళ్లలోపు వారు సైతం మద్యం, సిగరెట్‌లు తాగుతున్నారు. బర్త్‌డే పార్టీల పేరిట రోడ్ల మీద హంగామా చేస్తున్నారు. కొందరు మద్యం తాగి సోషల్‌మీడియాలో ఫొటోలు సైతం పెడుతున్నారు.

భయం లేకపోవడమేనా?


గతంలో తల్లిదండ్రులు, గురువులు అంటే పిల్లలు భయపడేవారు. ప్రస్తుతం తల్లిదండ్రుల అతిగారాబంతో చిన్నారులకు వారంటే భయం ఉండడం లేదు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఏమన్నా అంటే తల్లిదండ్రులు గొడవలు పెట్టుకునే పరిస్థితి ఉంది. దీంతో వారు సైతం మిన్నకుండిపోతున్నారు. ఇటీవల ఓ ప్రైవేటు పాఠశాలలో చిన్నారి చేసిన తప్పిదానికి ఉపాధ్యాయుడు మందలిస్తే తల్లిదండ్రులు, బంధువులు సదరు ఉపాధ్యాయుడిపై గొడవకు దిగారు.

తల్లిదండ్రుల్లో మార్పు వస్తేనే..

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఫోన్లు, బైకులు, డబ్బులిచ్చి పాఠశాలకు కళాశాలకు పంపితే సరిపోతుందని భావించడంతోనే విద్యార్థులు పక్కదారి పడుతున్నారు. తాము పడుతున్న కష్టాలను తల్లిదండ్రులు తమ పిల్లలకు చూపించాల్సి ఉంది. పిల్లలు ఎటు పోతున్నారో ఓ కంట కనిపెట్టాలి. పిల్లల బాగోగులను ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకోవాలి. విద్యార్థి ప్రవర్తనలో మార్పు కనిపిస్తే ఉపాధ్యాయుల సలహాలు తీసుకోవాలి.



ఆలోచన విధానం మారాలి



పిల్లలకు తల్లిదండ్రుల నుంచే క్రమశిక్షణ అలవాటు అవుతుంది. పిల్లలకు ఏమిస్తున్నాం, దాని అవసరం ఎంత ఉందని తల్లిదండ్రులు తెలుసుకోవాలి. చిన్న వయస్సులో అవసరానికి మించి బైకులు, ఖరీదైన ఫోన్లు ఇచ్చి కళాశాలకు, పాఠశాలకు పంపరాదు. సంస్కారం తల్లిదండ్రులు నుంచి వస్తుంది. వినయం విద్య ద్వారా వస్తుంది. తాము కూడా పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– రమేశ్‌కుమార్, ఎస్‌ఐ, దౌల్తాబాద్

క్లుప్తంగా

అదుపు తప్పిన స్కూటీ.. వ్యక్తికి గాయాలు

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు స్కూటీ అదుపు తప్పి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని పాంబండ ఆలయ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఆమనగల్లు మండలానికి చెందిన వెంకటయ్య మండల పరిధిలోని రాంనగర్ గ్రామం నుంచి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో పాంబండ ఆలయ సమీపంలో స్కూటీ అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం


సారిక(ఫైల్)

కుల్కచర్ల: కంప్యూటర్ క్లాసులకు వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. రాంనగర్ గ్రామపంచాయతీ సూర్యనాయక్ తండాకు చెందిన సాలిబాయిరాములు దంపతుల కూతురు సారిక(18) ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. మండల కేంద్రంలో కంప్యూటర్ కోచింగ్‌కు వెళ్తోంది. ఈ నెల 9న క్లాస్‌కు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.

యువకుడి బలవన్మరణం


శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

అనంతగిరి: అనంతగిరి అడవుల్లో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణం చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ శీను తెలిపిన ప్రకారం.. కడప జిల్లా మైదకూరుకు చెందిన మాతురు శ్రీనివాస్‌రెడ్డి(32) హైదరాబాద్‌లోని బిర్లా సాఫ్ట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా ఉదయం అడవిలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకున్నాడని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి శ్రీనివాస్‌రెడ్డిగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకులు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నకిలీ బంగారం ఇచ్చి.. రూ. లక్షకు టోకరా

మీర్‌పేట: నకిలీ బంగారం ఇచ్చి లక్ష రూపాయలతో ఉడాయించిన సంఘటన మీర్‌పేట పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ మహేందర్‌రెడ్డి ప్రకారం.. బడంగ్‌పేట జయశంకర్ కాలనీకి చెందిన మాలకొండయ్య (39) టీకేఆర్ కళాశాల వద్ద జ్యూస్ సెంటర్ నడుపుతున్నాడు. ఈ నెల 3న ఓ గుర్తు తెలియని వ్యక్తి దుకాణం వద్ద కు వచ్చి తన వద్ద అసలైన, నాణ్యత కలిగిన బంగారు బిస్కెట్ ఉందని, దీని ఖరీదు లక్ష రూపాయలు అని చెప్పాడు. ఇది నమ్మిన మాలకొండయ్య సదరు వ్యక్తికి రూ.1 లక్ష ఇచ్చి బంగారు బిస్కెట్‌ను తీసుకున్నాడు. వ్యక్తి వెళ్లిపోయిన తర్వాత మాలకొండయ్య సమీపంలోని నగల దుకాణానికి వెళ్లి పరీక్ష చేయించగా నకిలీదని తేలింది. దీంతో బాధితుడు శుక్రవారం పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుడి మృతి

మొయినాబాద్: విద్యుత్ స్తంభాన్ని ఎక్కుతుండగా ఫిట్స్ రావడంతో కిందిపడి పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన ఎన్కేపల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన బాకారం సుమన్(27) పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం కనెక్షన్ ఇచ్చేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఫిట్స్ రావడంతో పైనుంచి కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రచార జోరు

ఊపందుకున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి

- డోర్ టు డోర్ తిరుగుతున్న అభ్యర్థులు, మద్దతుదారులు
- 13న నిర్వహించే పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- మండలానికో పోలింగ్ కేంద్రం.. వికారాబాద్‌లో రెండు
- జిల్లాలో మొత్తం 1,936 మంది ఓటర్లు


మాణిక్‌రెడ్డి


చెన్నకేశవరెడ్డి


ఏవీఎన్‌రెడ్డి

వికారాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రచా రం ఊపందుకుంది. నెల రోజుల క్రితం నుంచే నేతలు క్యాంపెయిన్ నిర్వహిస్తుండగా..ఎలక్షన్ గడువు సమీ పిస్తుండటంతో జోరు పెంచారు. పలు ఉపాధ్యాయ సంఘా ల నాయకులు సెలవులు పెట్టి మరీ తమ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు. పాఠశాలలు, విద్యా సంస్థలను సందర్శించి మూకుమ్మడిగా ఓటర్లను ప్రలోభపెట్టే ప్ర యత్నాలకు తెరలేపారు.ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 2017 మార్చిలో నిర్వహించిన ఎన్నికల్లో పీఆర్టీయూ బలపర్చిన అభ్యర్థి కాటేపల్లి జనార్దన్ రెడ్డి గెలుపొందిన విష యం తెలిసిందే. ఆరేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగగా.. మార్చి 29న పదవీ కాలం ముగియనుంది. ఆలోపు ఎన్నికలు నిర్వహించాలని భావించిన ఎలక్షన్ కమిషన్ ముహూర్తం (మార్చి 13) ఖరారు చేసింది.ఇందుకోసం జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రధాన సంఘాల తరఫున బరిలో ఉన్న వారి పేర్లను ముందుగానే ప్రకటించడంతో రెండు నెలలుగా ప్రచార పర్వం కొనసాగుతోంది.

త్రిముఖ పోటీ

హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు నిర్వహిస్తుండగా ఆయా ఉపాధ్యాయ సంఘాలకు చెందిన నేతలు తమ అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. టీపీఆర్టీయూ తరఫున ప్రస్తుత ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, పీఆర్టీయూ తరఫున ఆ సంఘం సీనియర్ నాయకుడు చెన్నకేశవరెడ్డి పేర్లను ఖరారు చేశారు. ఇదే సమయంలో ఆ సంఘం సపోర్టు ఉందంటూ హర్షవర్ధన్‌రెడ్డి సైతం బరిలో నిలిచారు. వామపక్ష అనుబంధ సంఘాలైన టీఎస్ యూటీఎఫ్ నుంచి మాణిక్‌రెడ్డి, టీయూటీఎఫ్ పక్షాన మల్లారెడ్డి తలపడనున్నారు. బీజేపీ భావజాలంతో పనిచేసే తపస్ తరఫున దిల్‌సుక్‌నగర్ పబ్లిక్ స్కూల్ నిర్వాహకుడైన ఏవీఎన్‌రెడ్డి బరిలో ఉన్నారు. బలమైన సంఘంగా గుర్తింపు ఉన్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయ సంఘానికి చెందిన వారే ముగ్గురు వ్యక్తులు బరిలో ఉండటంతో ఈసారి ఓట్లు చీలనున్నాయా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదవిలో ఉన్నవారు ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోలేదనే అసంతృప్తి నేపథ్యంలో.. ఇప్పటికే పలుమార్లు పోటీ చేసి ఓటమిపాలైన మాణిక్‌రెడ్డి గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి మూడో స్థానంలో నిలవడంతో పాటు హైదరాబాద్‌లో బాగా పట్టు ఉండటం, తపస్ నుంచి పూర్తి మద్దతు ఉన్న ఏవీఎన్‌రెడ్డి కూడా ఈసారి తాడో పేడో తేల్చుకునేందుకు రెడీ అయ్యారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో త్రిముఖ పోటీ తప్పదని ఓటర్లు, విశ్లేషకులు చెబుతున్నారు.

తాండూరు, వికారాబాద్ ఓటర్లు అధికం

మూడు జిల్లాలకు జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు మూడు నెలల క్రితమే కసరత్తు ప్రారంభించారు. ఓటరు జాబితాకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ ఇప్పటికే మొదటి, రెండో పబ్లిక్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఓటర్ లిస్ట్‌లో పేర్ల నమోదు కోసం దరఖాస్తులు స్వీకరించడంతో పాటు ఓటర్ల తుది జాబితాను కూడా ప్రకటించింది. జిల్లాలో మొత్తం 1,936 మంది ఓటర్లు ఉండగా.. వీరి సంఖ్య ఆధారంగా 18 పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. ఒక్కో మండలంలో ఒక్కో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయగా జిల్లా కేంద్రమైన వికారాబాద్‌లో రెండు సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అత్యధికంగా వికారాబాద్‌లో 564 మంది, తాండూరులో 445, పరిగిలో 290 మంది ఓటర్లు ఉన్నారు.

కొత్త సర్వీస్ రూల్స్ సాధనకు..

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో హర్షవర్ధన్‌రెడ్డికి పట్టం కట్టండి
- కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి


ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి

యాలాల: ఉపాధ్యాయులకు కొత్త సర్వీస్ రూల్స్ సాధనే కాంగ్రెస్ మేనిఫెస్టో అని తాండూరు మున్సిపల్ కౌన్సిలర్ వరాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని జుంటుపల్లి, అగ్గనూరు, బెన్నూరు, యాలాల, దేవనూరు, ముద్దాయిపేట, రాస్నం, పగిడియాల, కోకట్ తదితర పాఠశాలల్లో కాంగ్రెస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. టీ ఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డికి ఉపాధ్యాయ సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉందన్నారు. హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపిస్తే 317 జీఓ వల్ల స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని వివరించారు. సీపీఎస్ రద్దు, భాషాపండితుల, పీఈటీల అప్‌గ్రేడేషన్, నెలవారీ పదోన్నతులు, బదిలీలు చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. హర్షవర్ధన్‌రెడ్డికి వేసే ఓటు ప్రభుత్వ ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు సమస్యల పరిష్కారానికి ఆయుధంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలి


శరత్‌కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సాల్వీడు గ్రామంలోని ఆంజనేయ స్వామి, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల అభివృద్ధికి రూ.30వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్, మాజీ సర్పంచ్ జానకీరాం స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లిలో క్విజ్ పోటీలు


జ్ఞాపికలతో విజేతలు

బంట్వారం: శిక్షణ ఫౌండేషన్ మైండ్ ట్రీ ఆధ్వర్యంలో శుక్రవారం కోట్‌పల్లి ఎంఆర్సీ భవనంలో విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయి క్విజ్ పోటీల్లో గెలుపొందిన బంట్వారం, కోట్‌పల్లి, మర్పల్లి, పెద్దేముల్ మండలాల జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు హాజరయ్యారు. ఈ పోటీల్లో ఎంపీపీఎస్ అన్నాసాగర్, జెడ్పీహెచ్ఎస్ బూచన్‌పల్లి విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. ఎంపీపీఎస్ బండమీదిపల్లి, జెడ్పీహెచ్ఎస్ పెద్దేముల్ ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఎంపీపీఎస్ పెద్దేముల్, జెడ్పీహెచ్ఎస్ ఇందూరు తృతీయ స్థానంతో సరిపెట్టుకున్నారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి రవి శిక్షణ ఫౌండేషన్ మేనేజర్ కాశీనాథ్, సీనియర్ రాజు వాలంటీర్లు తుల్జప్ప ,ప్రభు, భీమేష్, నాగలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగదీశ్‌కు అంబేడ్కర్ నేషనల్ అవార్డు


ఆహ్వానపత్రం అందుకుంటున్న జగదీశ్

అనంతగిరి: బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర శాఖ అందించే బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు వికారాబాద్‌కు చెందిన జగదీశ్ ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. వికారాబాద్ జిల్లా దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడిగా పని చేస్తున్నక ఆయనకు ఈ అవార్డు వరించింది. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ అవార్డు రావడం పట్ల సంతోషంగా ఉందని, తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్


మర్పల్లి: మాట్లాడుతున్న ఎస్‌ఐ

మర్పల్లి: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ బాలిక గురుకుల పాఠశాలలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు, సైబర్ మోసాలు, బాలకార్మికులపై వికారాబాద్ పోలీస్ కళాకారుల బృందం ఆట,పాటలతో అవగాహన కల్పించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు ఏ రోజు పాఠాలను ఆరోజు చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలను, బాలికలను వేధించే వారిని జైలుకు పంపుతామన్నారు. సైబర్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా వేధిస్తే, సైబర్ మోసాలను గుర్తైనా 100కు లేదా 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, వికారాబాద్ పోలీస్ కళా బృందం ఇన్‌చార్జి దాస్, 1098 మండల కోఆర్డినేటర్ యాదయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ధారూరు: సైబర్ నేరాలు, మోసాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ధారూరు ఎస్‌ఐ సంతోశ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని నాగాసమందర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో పోలీసులు మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు అమాయకులను టార్గెట్ చేస్తున్నారన్నారు. ఈ నేరాలపై యువత, విద్యార్థులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. అనవసరమైన లింక్‌లు ఓపెన్ చేసి ఓటీపీలు షేర్ చేయొద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ విజయకుమారి

దోమ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఆర్డీఓ విజయకుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 13న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు.

ఆటోలో చెలరేగిన మంటలు

షాద్‌నగర్ రూరల్: ఆగి ఉన్న సెవెన్ సీటర్ ఆటోలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన శుక్రవారం పట్టణంలోని పాత జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. శంషాబాద్ మండలం పెద్ద తూప్ర గ్రామానికి చెందిన కుమార్ ఆటోనడుపుతుంటాడు. శుక్రవారం మధ్యాహ్నం ప్రయాణికులను షాద్‌నగర్‌లో దించి రోడ్డు పక్క ఆటో ఆపి భోజనానికి వెళ్లాడు. ఉన్నట్టుండి ఆటోలో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పట్టణ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.

కేవీఎన్ రెడ్డిని మండలికి పంపిద్దాం

బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్ ముదిరాజ్


మాడల్ స్కూల్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

పూడూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి కేవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి మండలికి పంపిద్దామని పార్టీ మండల అధ్యక్షుడు అనిల్ ముదిరాజ్ ఉపాధ్యాయులను కోరారు. శుక్రవారం మండల పరిధిలోని మాడల్ స్కూల్, మన్నెగూడ, సోమన్‌గుర్తి, ఉమ్మెంతాల్, అంగడిచిట్టంపల్లి, మంచన్‌పల్లి, కంకల్, పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీందర్, వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ప్రసాద్, రాఘవేందర్, మనోహర్, అశోక్, శ్రీశైలం, శేఖర్, మాణిక్యం, మల్లేశ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అసమర్థ పాలన

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్


కేశంపేట మండలంలో కొనసాగుతున్న విశారదన్ మహరాజ్ పాదయాత్ర

కేశంపేట: రాష్ట్రంలో అసమర్థ పాలన సాగుతోందని డీఎస్పీ(దళిత శక్తి ప్రోగ్రాం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆరోపించారు. పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని చౌలపల్లి, కేశంపేట, అల్వాల, ఎక్లాస్‌ఖాన్‌పేట, సంగెం ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల, కొండన్నగూడెం గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో డీఎస్పీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 90శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం దక్కాలని అన్నారు. కేసీఆర్ పాలనలో పీహెచ్‌డీలు చేసిన వారు పెయింటింగ్ పనికి, బీటెక్ చేసిన వారు కూలీ పనులకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఆత్మగౌరవంతో బతికేందుకు డీఎస్పీ కృషి చేస్తుందన్నారు. అణగారిన కులాలను విజేతలుగా మార్చి అధికారంలోకి తెచ్చేందుకే ఈ పాదయాత్రని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాకేష్, మండల అధ్యక్షుడు శివ, నాయకులు మహిపాల్, రవి, కృష్ణ, రమేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం


హెచ్ఎం అలీమొద్దీన్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మర్పల్లి: మండల పరిధిలోని పట్లూర్ ఉర్దూ మీడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు అతిథిగా హాజరై మాట్లాడారు. ఇక్కడ 2000 నుంచి 2010 వరకు విద్యనభ్యసించిన విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు ఫసియుద్దీన్, ఆరీఫ్, ఫిరోజ్, పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఉద్యోగ సంఘాల వత్తాసు

విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న సర్కార్

- ఎమ్మెల్యే రఘునందన్‌రావు ధ్వజం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

షాద్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యా వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ శాసన మండలి ఉపాధ్యాయ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం షాద్‌నగర్‌లో టీపీయూఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యా య, అధ్యాపక ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మా ట్లాడారు. ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక ఏ ఉపాధ్యాయ సంఘం కూ డా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. 317 జీఓ తీసుకొచ్చి ఉపాధ్యాయుల ను ప్రభుత్వాలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని ఆరోపించారు. ఉపాధ్యాయ హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందని మండిపడ్డారు. ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలన్నీ కేసీఆర్‌కు వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. గతంలో గెలిచిన ఎమ్మెల్సీలు ప్రభుత్వానికి అనుకూలంగానే వ్యవహరించారని చెప్పారు. శాసన మండలిలో ప్రశ్నించే గొంతుక అయిన తపస్, బీజేపీ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టం కట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటమి చెందుతా మని భయంతోనే సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీ అభ్యర్థిని నిలబెట్టలేదని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భాగ్యవతి, సుమరంజని, అందె బాబయ్య, దేపల్లి అశోక్‌గౌడ్, కక్కునూరి వెంకటేష్ గుప్త, సుదర్శన్‌రెడ్డి, భూపాలాచారి, విష్ణువర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, నర్సింహాగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌నకు ప్రకాశ్ అర్హత


ప్రకాశ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పూడూరు: జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌నకు మండల పరిధిలోని కంకల్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి మాదారం ప్రకాశ్ టాపర్‌గా నిలిచారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో బీజేపీ నాయకులు విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు రవీందర్, వెంకటయ్య, అంజనేయులు, శేఖర్, అశోక్, శ్రీశైలం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

షాబాద్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో బంగారు ఆభరణాలు చోరీ చేసిన వ్యకిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు షాబాద్ సీఐ గురువయ్యగౌడ్, ఎస్‌ఐలు మహేశ్వర్‌రెడ్డి, బాల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కేశపల్లి సుజాత ఈ నెల 4వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో తన పొ లంలో గులాబీ పూలు కోసేందుకు కొడుకుతో కలిసి వెళ్లింది. రాత్రి రెండు గంటలకు ఇంటికి వచ్చారు. గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి.. సుజాత ఇంటి ప్రహరీ దూకి వెళ్ల డాన్ని పక్కింటి వాళ్లు చూశారు. ఈ విషయాన్ని ఆమెకు తెలిపారు. సుజాత ఇంట్లోకి వెళ్లి అల్మారా తెరిచి చూడగా నాలుగు తులాల బంగారం నెక్లెస్ కనపడలేదు. ఈ విష యాన్ని ఆమె షాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నవీన్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించా రు. దొంగిలించిన నాలుగు తులాల బంగారం నెక్లెస్‌ను స్వాధీనం చేసుకొని, నిందితున్ని రిమాండ్‌కు తరలించారు.